క్లుప్తంగా

వాత్సల్య పథకాన్ని వినియోగించుకోవాలి



దామెర: వాత్సల్య పథకాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. మండలంలోని ల్యాదెళ్లలో దామెర సెక్టార్ అంగన్‌వాడీ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. మిషన్ వాత్సల్య పథకం కోసం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి దరఖాస్తులు చేసుకునేలా చూడాలని తెలిపారు. మే 10 లోగా వచ్చిన దరఖాస్తులను గ్రామ, మండల బాలల పరిరక్షణ కమిటీలు తీర్మానం చేసి పంపించేలా అంగన్‌వాడీలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆత్మకూరు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూనియర్‌పంచాయతీ కార్యదర్శులకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉంటుందని అధైర్యపడొద్దన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు, మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ బయ్య తిరుపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాజు, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, బీసీసెల్ నాయకుడు పూజారి రాము, యూత్‌కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తనుగుల సందీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ప్రతినిధి మహమ్మద్ మున్నాను వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఈసీ మెంబర్‌గా నియమించినట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయి కుమార్‌గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో మానవ హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం చేసేందుకు, ప్రతి ఒక్కరికీ సహజసిద్ధమైన గౌరవం, శాశ్వతమైన హక్కులకై తన వంతు కృషి చేస్తానని మున్నా ఈ సందర్భంగా తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్, రాష్ట్ర మహిళా చైర్మన్, జిల్లా చైర్మన్లకు మున్నా కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



పరకాల: మండలంలోని ధర్మారానికి చెందిన గడల రమేశ్ ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ఆచూకీ తెలపాలని పరకాల పోలీసులకు మీ సేవ ద్వారా దరఖాస్తు చేశాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్‌ను కొనుగొని శనివారం సీఐ కిషన్ ఆదేశాల మేరకు ఎస్సై శివకృష్ణ బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా రమేశ్ పోలీసు అధికారులకు కృతజ్ఞత తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



పరకాల: పరకాల మండలం వెంకటాపురానికి చెందిన మునిగాల సురేందర్‌రావుకు సోషల్ సర్వీస్ కింద తమిళనాడులోని ఏషియన్ ఇంటర్నేషనల్ కౌన్సిలర్ రీసర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ శనివారం అందించారు. కరోనా లాక్‌డౌన్ నుంచి సురేందర్‌రావు అందిస్తున్న సామాజిక సేవలను గుర్తించి డాక్టరేట్‌ను అందించినట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా



నడికూడ: మండలంలోని చర్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. చిన్నారులకు అసెస్మెంట్ కార్డులను అందజేశారు. ప్రీ స్కూల్‌కు సంబంధించిన మెటీరియల్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాడ తిరుపతి, అంగన్‌వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్యారాణి, అంగన్‌వాడీ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

● డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఎల్కతుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానలపై పోరాటం సాగించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థకు విఘాతం కలిగిస్తూ పాసిస్టు పాలన కొనసాగిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఇతర మతస్తులను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తూ దేశ సమగ్రత, సమైఖ్యతను విధ్వసం చేస్తున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దళితులకు ఇస్తానని చెప్పిన మూడెకరాల భూమి పంపిణీ చేయాలన్నారు. దళితబంధు పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పంచరాయి భూములను సాగుచేసుకుంటున్న దళితులకు ధరణి పట్టాబుక్కులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ నిమ్మల మనోహర్, నాయకులు శనిగరం రాజకుమార్, అంబాల స్వామి, కామెర లక్ష్మణ్, ఎర్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పెంపకం, వినియోగంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న భానుమతి

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో మారి ఫీల్డ్ ఫెసిలిటేటర్ భానుమతి ఆధ్వర్యంలో రైతులకు పిచ్చిరొట్ట పైర్ల పెంపకం, వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా భానుమతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో భూమికి పోషకాలను అందిస్తుందని, జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర, అలసంద వంటి పైర్లను పూ మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నడంతో పచ్చి రొట్టతో భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. పంటల దిగుబడి కూడా పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శంకర్‌రావు, సుధాకర్, లక్ష్మణ్‌రావు, రాజేశ్వర్‌రావు, రాజేందర్, శ్రీనివాస్, బక్కయ్య, మల్లయ్య, భాస్కర్, బాపూరావు, తదితరులు పాల్గొన్నారు.

దామెర ఎంపీఓగా నాగరాజు



దామెర: మండల పరిషత్ అధికారి (ఎంపీఓ)గా కుసుమ నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. భీమదేవరపల్లి ఎంపీఓగా పనిచేస్తున్న నాగరాజు దామెరకు, దామెరలో పనిచేస్తున్న యాదగిరిని భీమదేవరపల్లికి డిప్యూటేషన్‌పై పంపించారు. కాగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజుకు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

అకాల వర్షానికి కుదేలవుతున్న రైతులు



భీమదేవరపల్లిలో ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళలు



కొప్పూర్‌లో గాలికి ధ్వంసమైన రేకులు

ఎల్కతుర్తి: వారంరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో రైతులు కుదేలవుతాన్నారు. చేతికందొచ్చిన వరిపంట నేలవాలింది. పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచి పంటకోత కోసేందుకు వీలులేకుండా నేలలు దిగబడుతున్నాయి. భీమదేవరపల్లి మండలంలో కోత కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడితే కురిసిన వర్షానికి తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో మామిడికాయ నేలరాలి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొప్పూర్ గ్రామంలో శనివారం ఈదురు గాలులు వీచడంతో రేకులు ధ్వంసమయ్యాయి. భీమదేవరపల్లి మండలంలో 2.6సెంటిమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం అకాల వర్షాలతో పంటనష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. అలాగే తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటినుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామి మూలవిరాట్



ఉత్సవ మూర్తులు



వేణుగోపాలస్వామి ఆలయం

ఆత్మకూరు: నేటి(ఆదివారం) నుంచి మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి శనివారం తెలిపారు. నేటి నుంచి వచ్చే మే 5వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం తొళ్లక్కంతో అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని వచ్చేనెల 1న ప్రాబోధకి, ప్రబంధసేవాకాలం, 2న ధ్వజారోహణం(గరుడముద్దలు), 3న ఉదయం హోమం సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, 4న పూర్ణాహుతి, 5న వ్యాసపౌర్ణమి బండ్లు తిరుగుట జాతర జరుగుతుందని అర్చకులు మాధవమూర్తి వివరించారు. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి, స్వామి ఆశీస్సులు పొంది, స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ బలోపేతం



మాట్లాడుతున్న మంద రాజు మాదిగ



కమలాపూర్: మాట్లాడుతున్న ఏకు శంకర్

ధర్మసాగర్(వేలేరు): గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీలను బలోపేతం చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ తెలిపారు. వేలేరు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. (విజన్ 50 డేస్) 50 రోజులు పల్లె పల్లెకు కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెకు వెళ్లి ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. 29 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమ ప్రస్థానంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మోసం చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని మాదిగలను కోరారు. ఇక నుంచి మాదిగ, మాదిగ ఉపకులాలను చైతన్యపరిచి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన రాజ్యాధికారం దిశగా ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను నియమించినట్లు తెలిపారు. గుండ్లసాగర్ గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా టేకుల శివ, ఎంఎస్పీ అధ్యక్షుడిగా టేకుల రవి, వేలేరు గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా గొర్రె నవీన్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్, వేలేరు మండలాల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్‌లు బొడ్డు శాంతిసాగర్, కనకం రాజయ్య, వేలేరు ఎంఎస్పీ మండల కన్వీనర్ రామంచ ఏసు, ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల కో కన్వీనర్ కొట్టె కల్యాణ్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుక రాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) మండల కన్వీనర్‌గా వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన రామంచ ఏసు మాదిగను నియమించినట్లు శనివారం ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ ప్రకటించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రామంచ ఏసు తెలిపారు.

కమలాపూర్ :ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ సూచించారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ, అనుబంధ సంఘాల గ్రామ కమిటీల నిర్మాణం కోసం 'పల్లెకు పోదాం పదండి' అనే నినాదంతో 50 రోజుల కార్యాచరణలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మెస్పీ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గామాల్లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల కమిటీల నిర్మాణం జరగాలని, ఇందు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పటిష్టమైన కమిటీల నిర్మాణం చేపట్టాలన్నారు. ఎమ్మెస్పీ ఎల్కతుర్తి మండల ఇన్‌చార్జ్ చిలువేరు సంపత్, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా కో కన్వీనర్ అంకిల్ల రాజు, ఎంఎస్‌పీ మండల నాయకులు నద్దునూరి ప్రసాద్, అంబటి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన కోతులు



తప్పిన కోతుల బాధ..!

ఆత్మకూరు: గ్రామాల్లో కోతులు సృష్టిస్తున్న బీభత్సం అంతాఇంతా కాదు.. పంట పొలాలనుంచి మొదలుకుని, ఇళ్లలోకి కూడా చేరి చేతికి దొరికిన ప్రతి ఆహార పదార్థం, వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. దీంతో కోతుల బెడదను తప్పించాలని భావించి, మండలకేంద్రంలో జీపీ ఆధ్వర్యంలో శనివారం బోనులు ఏర్పాటు చేసి కోతులను పట్టి ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల పాలిట వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కులు అందజేస్తున్న శ్రీరాములు, మధుమతి

ఐనవోలు: పేదరికంలో ఉండి అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారిందని జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీరాములు, మధుమతి మాట్లాడుతూ వైద్య సేవల కోసం పేదలు అప్పులపాలు కాకుండా సీఎం సహాయనిధి ద్వారా సహాయం చేస్తున్నట్లు చెప్పారు. వివిధ గ్రామాలకు చెందిన 15 మంది బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు, ఆలయ చైర్మన్ మజ్జిగ జైపాల్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, బాధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..

ఐనవోలు: బంధువు అంత్యక్రియలకు వచ్చి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని నాగపురం శివారు బొలిచెరువులో చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. నాగపురంలో అనారోగ్య కారణాలతో గోనె నర్సయ్య మృతిచెందగా.. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన గోనె రాజు (33) భార్యతో కలిసి నాగపురం వచ్చాడు. అంత్యక్రియల అనంతరం స్నానం చేయడానికి వెళ్లిన రాజు చెరువులో పడి ఈత రాకపోవడంతో మృతిచెందాడు. రాజు భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు నేతల పరామర్శ



వేలేరులో నివాళులర్పిస్తున్న కడియం



శాయంపేట: పరామర్శిస్తున్న మధుసూదనాచారి



ఆత్మకూరు: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి



కమలాపూర్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్

ధర్మసాగర్(వేలేరు): మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన చాడ విజేందర్‌రెడ్డి తల్లి చాడ వినోద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కడియం వెంట మల్లికుదుర్ల సర్పంచ్ గోదల రాజిరెడ్డి, ఎంపీటీసీ బాల్నె వెంకటేశ్వర్లు, ఉమ్మడి ధర్మసాగర్ ఎంపీపీ బొజ్జ రవీందర్ యాదవ్, వేలేరు మాజీ సర్పంచ్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ప్రగతిసింగారంలో..

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పోతు రమణారెడ్డికి ఇటీవల ప్రమాదవశాత్తు చేతికి ప్యాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శనివారం రమణారెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన బోనపల్లి ఇందిర ఇటీవల మరణించగా ఎమ్మెల్సీ బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, పీఏసీఎస్ డైరెక్టర్ భగ్గి రమేష్, నాయకులు తోకల సమ్మిరెడ్డి, సిరికొండ యువసేన జిల్లా నాయకులు బేర్గు రాకేష్, గ్రామ శాఖ అధ్యక్షులు దూలం నాగరాజు, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే గౌస్, నాయకులు ప్రేమ్‌కుమార్, రవీందర్, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..

ఆత్మకూరు: బాధితకుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన జన్ను రమాదేవి మృతదేహాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు రూ.25వేలు బాధిత కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పాపని రవీందర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, బాషబోయిన సాగర్, ఎండీ అంకూస్, పెరుమాండ్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఈటల పరామర్శ

కమలాపూర్: కమలాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను, గాయపడ్డ క్షతగాత్రులను హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శనివారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని గూడూరులో గుండెపోటుతో మృతి చెందిన నరిగె కుమారస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం కమలాపూర్‌లో ఇటీవల మృతి చెందిన బొప్ప రాజయ్య, మౌటం కుమారస్వామి, జంగిలి మొగిలి, తవుటం సదానందం, పబ్బు మల్లికాంబ,రాంశెట్టి సాంబయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో శ్రీరామనవమి సందర్భంగా గాయపడ్డ కమలాపూర్‌కు చెందిన హోంగార్డు కల్యాణిని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ మాట్ల రమేష్, నాయకులు మౌటం సంపత్, పబ్బు సాంబయ్య, పల్లి సతీష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల నూతన కమిటీ



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

ఎల్కతుర్తి: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆదేశాల మేరకు ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం పద్మశాలి నూతన మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా సూరారం గ్రామానికి చెందిన వేముల సమ్మయ్య, మండల అధ్యక్షునిగా వేముల రవీందర్, మండల కార్యదర్శిగా అల్లి శ్రీహరి, ఉపాధ్యక్షులుగా సుంకన్నపెల్లి రవీందర్, చిదురాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా దాసరి రాజేందర్, చిదురాల వెంకటేష్, మండల యువజన సంఘం కార్యదర్శిగా స్వర్గం అనీల్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా చిదురాల మహేష్, గబ్బేటి శ్రీనివాస్, గాజుల రాజేష్, రంజిత్, ఉపేందర్, వేణు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చందం మల్లయ్య మాట్లాడుతూ పద్మశాలీందరు సంఘటితంగా ఉండి ఒకరికొకరు సహాయ సాకారాలు అందించుకుంటూ సంఘం అభివృద్ధికోసం పాటుపడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించబడిన సంఘానికి ప్రాతినిథ్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంజి శ్రీశైలం, గబ్బేటి రమేష్, కేశవులు, రవీందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోకి 100మంది పంచాయతీ కార్యదర్శులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో 100మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ పలు డిమాండ్ల సాధనకు సమ్మెలోకి వెళ్లారు. ఈక్రమంలో వారి స్థానంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈమేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఓ జగదీశ్వర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 208గ్రామ పంచాయతీలు ఉండగా, 129జీపీలకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వారిలో సుమారు 60మందికి నాలుగేళ్ల సర్వీస్ పూర్తయింది. ప్రభుత్వం, జేపీఎస్‌ల మధ్య గతంలో కుదిరిన ఒప్పందం, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న జేపీఎస్‌ను రెగ్యులర్ చేయాల్సి ఉంది. కొంతకాలంగా ఈ విషయంలో ప్రభుత్వానికి కార్యదర్శులు విజ్ఞప్తులు చేస్తున్నా స్పందన లేకపోవడంతో సమ్మెలోకి వెళ్లారు. సమ్మెకు వెళ్లిన వారి సమాచారం తెలుసుకున్న జిల్లా అధికారులు.. మండల స్థాయి నుంచి సమాచారం తీసుకున్నారు. విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించి 100మంది స్థానంలో ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉన్న సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు పొందిన వారిలో ఎంపీఓలు, ఎంపీఓలు, బిల్ కలెక్టర్లు, జీపీ జూనియర్ అసిస్టెంట్లు, ఏపీఓలు ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వారు జేపీఎస్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

దామెర: వడగండ్ల వర్షానికి పంట నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఒగ్లాపూర్‌లో శనివారం పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనతరం ఆయన మాట్లాడారు. గత సంవత్సరం పంటనష్టం లబ్ధిదారుల ఎంపికలో అవకతవలు చోటు చేసుకున్నాయని విమర్శించారు. ఈ సారైన సమగ్రంగా సర్వే నిర్వహించి వాస్తవంగా పంట నష్టంవాటిల్లిన రైతులను గుర్తించి పరిహారం త్వరగా అందించాలని కోరారు. ఎకరానికి రూ.25వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట వర్కింగ్ ప్రెసిడెంట్ పొలెపాక శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, సీనియర్ నాయకులు సదిరం పోశయ్య, దామెర శంకర్, దుబాసి రాజేందర్, కిన్నెర కోటి, రాసమల్ల కిరణ్ తదితరులు ఉన్నారు.